రైతన్న భూమికి ప్రభుత్వ హామీ

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి రైతు భూమికి ప్రభుత్వ హామీ దక్కేలా జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష పేరిట సమగ్ర భూ సర్వేను చేపట్టింది. దీనిపై ఎన్నో ఆరోపణలు చేసి, అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తాజాగా గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించింది. గత ప్రభుత్వ లోపాలను వెతికిపట్టుకోవాలన్న ప్రస్తుత పాలకుల లక్ష్యం మాత్రం నెరవేరలేదు. సబ్బవరం మండలంలోని 20 గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో వచ్చిన అర్జీలే ఇందుకు నిదర్శనం.

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర రీ సర్వే
- రాష్ట్ర ప్రభుత్వం, సర్వే ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహణ
- కూటమి ప్రభుత్వంలో రీ సర్వేపై గ్రామ రెవెన్యూ సదస్సులు
- నమోదులో చిన్నచిన్న పొరపాట్లు మినహా అంతా భేష్



అయ్యన్నపాలెంలో జగనన్న శాశ్వత భూహక్కు రీ సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, అధికారులు(ఫైల్)



సబ్బవరం: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రెవెన్యూ రికార్డుల స్వచ్ఛీకరణలో భాగంగా సర్వే ఆఫ్ ఇండియాతో కలిసి, సమగ్ర భూ సర్వే నిర్వహించింది. దశాబ్దాలుగా రైతులు భూమిని సాగుచేస్తున్నా వారి పేర్లు రెవెన్యూ రికార్డుల్లో లేకపోవడం, కమతాల విభజన తదితర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో సబ్బవరం మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి తొలుత కొన్ని గ్రామాల్లో సర్వే జరిపి, సత్ఫలితాలు రావడంతో మండల గ్రామాలకు, రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టారు. దీనిపై ఆరోపణలు గుప్పించిన కూటమి నాయకులు, అధికారంలోకి వచ్చాక ముందుగా దీనిపైనే దృష్టిసారించారు. భారీ ఎత్తున నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సుల్లో వీరి తీరు కొండను తవ్వి ఎలుకను పట్టినట్లే అయింది.

గత ప్రభుత్వంలో పక్కాగా రీసర్వే

గత ప్రభుత్వంలో రీసర్వేపై ఎంపిక చేసిన గ్రామాల్లో గ్రామ సభల ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. ఎంపిక చేసిన సర్వే నంబర్ల పరిధిలోని రైతులకు ముందుగానే వలంటీర్ల ద్వారా సమాచారం అందించారు. రైతుల సమక్షంలో సర్వే చేపట్టి వారి అభీష్టం మేరకే కమతాల మధ్య హద్దులను నిర్ణయించారు. ఆ వివరాల ఆధారంగా డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్(డీఎల్‌ఆర్) రూపొందించి గ్రామ పంచాయతీల్లో అందుబాటులో ఉంచారు. రైతులకు 9(2) నోటీసుల ద్వారా విస్తీర్ణాల వివరాలు తెలిపారు. రైతుల భూ విస్తీర్ణంలో వ్యత్యాసం ఉన్నట్లు గుర్తిస్తే అధికారుల దృష్టికి తీసుకెళ్లే, సమస్యను పరిష్కరించాకే పట్టాదారు పాస్ పుస్తకాలను అందించారు.

మండలంలో రీ సర్వే నిర్వహించిన గ్రామాలు	20
రీ సర్వే గ్రామాల్లో ఉన్న మొత్తం రైతులు	12,382
మొత్తం ల్యాండ్ పార్సిల్ మ్యాప్(ఎల్‌పీఎం)లు	33,397
తాజా రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలు	1,851

కూటమి నేతల ఆనందం ఆవిరి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వం జరిపిన రీ సర్వేలో తప్పులు జరిగాయన్న అపోహలు సృష్టించారు. కూటమి నేతల కళ్లలో ఆనందం నింపేందుకు అధికార యంత్రాంగం గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహించింది. రైతుల నుంచి అర్జీలు స్వీకరించింది. రీ సర్వే చేపట్టిన 20 గ్రామాల్లో ఉన్న 33,397 ల్యాండ్ పార్సిల్ మ్యాప్(ఎల్‌పీఎం)లపై కేవలం 1851 అర్జీలు మాత్రమే వచ్చాయి. అందులో కూడా సగానికంటే ఎక్కువ వెబ్‌ల్యాండ్ నమోదు, కుటుంబ సభ్యుల మధ్య ఆస్తి పంపకాలు, సబ్ డివిజన్, పేర్లు, ఫొటోల మార్పుపైనే. విస్తీర్ణ వ్యత్యాసాలపై వచ్చిన 999 దరఖాస్తుల్లో దాదాపు అన్నీ చెరువులు, ప్రభుత్వ భూములను ఆనుకుని/కలిసి ఉన్నవే కావడం గమనార్హం. దీంతో కూటమి నేతలు ఆశించిన ఆనందం మాత్రం దక్కలేదు.

సమస్యల వారీగా అర్జీలు

విస్తీర్ణంలో వ్యత్యాసాలు	999
వెబ్‌ల్యాండ్ ఎంట్రీలు	434
రైతుల పేర్లలో పొరపాట్లు	135
రెవెన్యూ భూ తప్పిదాలు	107
ఎల్‌పీఎంల విభజన	37
రైతు ఫొటోల పొరపాట్లు	37
సర్వే నంబర్లలో పొరపాట్లు	36
డీఎల్‌ఆర్‌లో పొరపాట్లు	25
భూ వర్గీకరణ	22
పాస్‌బుక్‌లో మార్పులు	19



టెక్కలిపాలెంలో ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

చిన్న వ్యత్యాసాలపై అర్జీ



గ్రామంలో 4 ఎకరాల వరకూ జిరాయితీ భూమి ఉంది. ఇందులో 2.90 ఎకరాలు మాత్రమే మా అమ్మగారి పేరున ఆన్‌లైన్‌లో నమోదయింది. గత ప్రభుత్వంలో నిర్వహించిన రీ సర్వేలో మా నలుగురు అన్నదమ్ముకు విడివిడిగా పాస్‌పుస్తకాలను ఆన్‌లైన్ చేసి ఇచ్చారు. ఒకటీ అర సెంటు వ్యత్యాసంపై ఇటీవల నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో అర్జీ చేసుకున్నా.

– పిల్లల అప్పలనాయుడు, రాయపుర అగ్రహారం

వివరాలు సరిపోయాయి



గ్రామంలో మాకు 37 సెంట్ల జిరాయితీ భూమి ఉంది. దీంతో పాటు మరో రెండెకరాల ప్రభుత్వ భూమి ఉంది. గత ప్రభుత్వంలో మా గ్రామంలో రీ సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో మాకు ఉన్న జిరాయితీ 0.37 సెంట్లతో పాటు ప్రభుత్వ భూమి 2 ఎకరాలకు ఆన్‌లైన్ చేసి పట్టాదారు పాస్ బుక్ ఇచ్చారు. మా వివరాలు సరిపోవడంతో అర్జీ చేసుకునే అవసరం రాలేదు.

– అంగటి కోటేశ్వరరావు, ఎ.సిరసపల్లి గ్రామం

చిన్నచిన్న సమస్యలపైనే అర్జీలు



గత ప్రభుత్వంలో మండలంలోని 20 గ్రామాల్లో రీ సర్వే నిర్వహించారు. పొరపాట్లేమైనా జరిగితే, సరిచేసేందుకు తాజాగా రెవెన్యూ సదస్సులు నిర్వహించాం. ఈ సదస్సుల్లో చాలా వరకూ చిన్నచిన్న పొరపాట్లు, సెంటు/రెండు సెంట్ల వ్యత్యాసం, ఆస్తి పంపకాలు, ఎల్‌పీఎంల విభజన వంటివాటిపైనే అర్జీలు వచ్చాయి. రైతుల సమక్షంలోనే విచారణ చేపట్టి, సమస్యలు పరిష్కరిస్తాం.

– బి.చిన్నికృష్ణ, తహసీల్దార్

క్లుప్తంగా

జనవాణిలో పంచగ్రామాల సమస్యపై వినతి

సింహాచలం: పంచగ్రామాల భూసమస్య పరిష్కరించాలని అమరావతిలో జనసేన పార్టీ కార్యాలయంలో జరుగుతున్న జనవాణిలో సమైక్య ప్రజారైతు సంక్షేమ సంఘం నాయకులు శుక్రవారం వినతిపత్రం అందించారు. కాకినాడ ఎంపీ టి.ఉదయ్‌ని కలిసి 30 ఏళ్లుగా ఇబ్బంది పడుతున్న తమ సమస్యను విన్నవించారు. రైతులు, నివాసితులు, ఖాళీస్థలాల యజమానులు పడుతున్న ఇబ్బందులను తెలిపారు. ఈ విషయంపై స్పందించిన ఎంపీ ఉదయ్ పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి సమస్యను తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్టు రైతు సంఘం నాయకులు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో సంఘ అధ్యక్షుడు వీబీఎన్ ప్రతాప్, కార్యదర్శి టీవీ కృష్ణంరాజు, నాయకులు వి.హనుమంతరావు, టీఎల్‌జీవీ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అప్పన్న సన్నిధిలో వీఎంఆర్‌డీఏ చైర్మన్



కప్ప స్తంభానికి మొక్కుకుంటున్న ప్రణవ్ గోపాల్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని వీఎంఆర్‌ఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం తర్వాత ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని ఏఈవో ఆనంద్‌కుమార్ అందించారు.

సైన్స్ ల్యాబ్ పరికరాల వితరణ



కళాశాల విద్యార్థినులతో సైన్స్ పరికరాలు అందించిన చెరుకూరి సృజన్ కుటుంబం

పరవాడ: స్థానిక జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ ప్లస్‌కు సైన్స్ ల్యాబ్ పరికరాలను చెరుకూరి సృజన్ శుక్రవారం అందించారు. గ్రామానికి చెందిన తన మిత్రుడి ప్రోత్సాహంతో వీటిని సమకూర్చారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకుని, ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను పెంచుకోవాలని కోరారు. కళాశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో సహాయ సహకారాలు అందించిన చెరుకూరి కుటుంబ సభ్యులకు కళాశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో విశాఖ లయన్ మంత్రి జగన్నాథరావు, చెరుకూరి కుటుంబ సభ్యులు రమేష్‌బాబు, నాగమల్లేశ్వరి, అనిరుధ్, కళాశాల అధ్యాపకులు విజయశ్రీ, జగదీష్, దిలీప్, అప్పలనాయుడు, నిర్మలా కుమారి, శ్యామల, లోవ శ్రీనివాస్ పాల్గొన్నారు.

'స్టీల్‌ప్లాంట్'పై ప్రధాని ప్రకటన చేయాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించాలని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ విజ్ఞప్తి చేశారు. సీఐటీయు ఆధ్వర్యంలో శుక్రవారం ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ కూడలి వద్ద ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కార్మికులకు రెండు నెలల నుంచి పూర్తిగా జీతాలు చెల్లించలేదన్నారు. ఫలితంగా కార్మికులు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారన్నారు. కార్మికులు కుటుంబాలతో సహా రోడ్లపైకి వచ్చి నిరసనలు చేస్తున్నా యాజమాన్యం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందని ధ్వజమెత్తారు. ఉన్నతాధికారులు మాత్రం ఒకటో తేదీన జీతాలు తీసుకుంటూ కార్మికులను ఇబ్బంది పెట్టడంలో సరికాదన్నారు. 29న విశాఖ వస్తున్న ప్రధానితో ప్రైవేటీకరణ ఉపసంహరణపై సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. యూనియన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వై.టి.దాస్, యు. రామస్వామి పాల్గొన్నారు.

వెంకన్నకు విశేష పూజలు



అభిషేకాలు చేస్తున్న అర్చకుడు

పెందుర్తి: వేంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం విశేష పంచామృతాభిషేకం చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడిన 13 మందిపై కోర్టు రూ.లక్షా 30 వేల జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్‌ఐ నరసింహరాజు తెలిపారు. శుక్రవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా జడ్జి పైవిధంగా తీర్పు చెప్పినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనం నడిపేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పరవాడ: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధి లంకెలపాలెం–మంత్రిపాలెం మధ్య తుప్పల్లో గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు శుక్రవారం కనుగొన్నారు. ఈ సమాచారాన్ని పరవాడ పోలీసులకు తెలిపారు. సమాచారం అందుకున్న సీఐ ఆర్.మల్లికార్జునరావు ఘటనాస్థలికి చేరుకుని, మృతదేహం ఉన్న ప్రదేశాన్ని పరిశీలించారు. మృతుడికి 35–40 ఏళ్ల వయస్సు ఉంటుందని గుర్తించారు. మృతదేహం కుళ్లి పోయి దుర్వాసన వెదజల్లుతుండడంతో 15 రోజుల క్రితం మరణించి ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుడు సిమెంటు కలర్ హాఫ్ హ్యాండ్స్ కాలర్ టీ షర్ట్, గ్రే కలర్ ప్యాంటు, మూడు గిల్ట్ ఉంగరాలు ధరించాడు. మృతుడి వివరాలు తెలిస్తే పరవాడ పోలీసులను సంప్రదించాలని సీఐ కోరారు.

కూటమి వైఫల్యాలను గ్రామ స్థాయిలో ఎండగట్టాలి



వంగలి గ్రామ నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

వంగలి గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను, మోసపూరిత హామీలను గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు అన్నారు. మండలంలోని వంగలి గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలతో పెందుర్తి మండలం రాంపురంలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో గ్రామంలో చేపట్టే కార్యక్రమాలు, పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన కార్యాచరణపై చర్చించారు. కూటమి ప్రభుత్వ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ఎండగట్టాలన్నారు. చంద్రబాబు నైజాన్ని ప్రజలకు వివరించి, ప్రజాక్షేత్రంలో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ప్రయత్నించాలన్నారు. కార్యక్రమంలో వంగలి నాయకులు వేపాడ సోమునాయుడు, యర్రా శ్రీనివాసరావు, రాజు, కోట్ని అమ్మతల్లి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మూడోసారి ఆక్రమణ తొలగింపు!



పొక్లెయిన్ సాయంతో ఆక్రమణలు తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలో ప్రభుత్వ భూమి అక్రమణలను రెవెన్యూ అధికారులు యంత్రాల సాయంతో శుక్రవారం తొలిగించారు. సబ్బవరం సర్వే నెం.334/1లో ఉన్న 59 సెంట్ల స్థలంలో వెలిసిన ఆక్రమణలపై తహసీల్దార్ చిన్నికృష్ణ అదేశాల మేరకు ఆర్‌ఐ వీరయ్య చర్యలు తీసుకున్నారు. గతంలో ఇదే స్థలంలో రెండు సార్లు అక్రమ కట్టడాలను తొలిగించారు. ఇప్పుడు మూడోసారి. ప్రతిసారీ కొందరు వ్యక్తులు ఆ స్థలం చుట్టూ ప్రహరీ కట్టి ఆక్రమించేందుకు చూస్తున్నారని స్థానికులు చెప్తున్నారు. సామంత రాజులు, సంస్థానాలు ఉన్నప్పటి నుంచి ఈ స్థలంలో బంగ్లా కట్టి కప్పం వసూలు చేసుకునేవారని అంటున్నారు. బంగ్లాకు ఎదురుగా ఉన్న స్థలంలో గుర్రాలు కట్టేవారని చరిత్ర చెప్తోందన్నారు. దీన్ని సొంతం చేసుకునేందుకు చాలా మంది ప్రయత్నించారని, ప్రతిసారీ అధికారులు ఆక్రమణలు తొలగించడంతో సరిపెడుతున్నారని ఆక్షేపించారు. దీనిపై శాశ్వత పరిరక్షణ చర్యలు చేపట్టి, కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అంతిమయాత్ర వాహన కొనుగోలుకు విరాళం



ట్రస్ట్ వ్యవస్థాపకుడు దాడి శ్రీనుకి చెక్ అందిస్తున్న దాతలు తేజ, తనూష దంపతులు

పెందుర్తి: స్థానిక సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో అనాథ మృతదేహాల అంతిమ యాత్ర వాహనం కొనుగోలు నిమిత్తం బాలాజీ ట్రాన్స్‌పోర్టు, బాక్స్ పిజ్జా షాప్ యజమాని తిమ్మ నారాయణతేజ, తనూష దంపతులు రూ.లక్ష విరాళం అందించారు. శుక్రవారం సుజాతనగర్‌లోని బాక్స్ పిజ్జా షాప్‌లో జరిగిన కార్యక్రమంలో సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు దాడి శ్రీనుకు ఈ చెక్‌ను అందించారు. ట్రస్ట్ అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా నారాయణతేజ దంపతులకు ట్రస్ట్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

జాబ్‌మేళాలో 8 మందికి ఉద్యోగాలు



ఎంపికైన వారితో కళాశాల కార్యదర్శి థియోఫిలాస్, ప్రిన్సిపాల్ ఫ్లోరా

పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 8 మంది నిరుద్యోగ మహిళలు యొకొహోమా టైర్ల కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మొత్తం 25 మంది మహిళలు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఎంపికయిన 8 మందికి కంపెనీ సెంట్రల్ మేనేజర్ శ్రవణ్‌కుమార్ నియామకపత్రాలు అందించారు. జాబ్‌మేళాలో కళాశాల కార్యదర్శి టి.థియోఫిలాస్, ప్రిన్సిపాల్ ఎస్.ఇ.ఫ్లోరా, ప్లేస్‌మెంట్ అధికారి జి.కమలారాణి, రాజేశ్వరరావు, ఎం.వి.నాగమణి పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు నియామక పత్రాలు



నియామక పత్రాలు అందిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డీఈసీఈ విభాగంలో 6 నెలలు శిక్షణ పూర్తి చేసుకున్న ముగ్గురు విద్యార్థులకు మేధా సర్వో డ్రైవ్స్ కంపెనీలో ఉద్యోగాలు వచ్చాయి. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగాలకు ఎంపికైన కునిశెట్టి కావ్యశ్రీ, మురపాక రేవతి, చిల్లా జాహ్నవిలకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ నియామకపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగాలు పొందిన వారికి ఏడాదికి రూ.2.9 లక్షల ప్యాకేజీ అందుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎం.నాగమణి, డాక్టర్ యు.జయలక్ష్మి, ప్లేస్‌మెంట్ అధికారి సీహెచ్ ఆశారాణి, కె.వి.రత్నం పాల్గొన్నారు.

మంచి పుస్తకంతో స్నేహం.. విలువలతో కూడిన విద్య



అడవివరం జెడ్పీ హైస్కూల్ లైబ్రరీని ప్రారంభిస్తున్న ఆర్జేడీ విజయభాస్కర్




విద్యార్థులకు గ్రంథాలయాల ఉపయోగాన్ని వివరిస్తున్న ఆర్జేడీ

- విద్యార్థుల ఉత్తమ భవిష్యత్తుకు మార్గదర్శకాలివే
- పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ విజయభాస్కర్

సింహాచలం: మంచి పుస్తకాలతో స్నేహం చేయడం, విలువలతో కూడిన విద్యా బోధన ద్వారా విద్యార్థులు ఉన్నత భవిష్యత్తును చేరుకుంటారని పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ విజయ్‌భాస్కర్ అన్నారు. అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్లో 400 పుస్తకాలతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తుని తీర్చిదిద్దేవి గ్రంథాలయాలేనని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తరగతి పాఠ్యాంశాలతో పాటు వ్యక్తిత్వ వికాసం, విజ్ఞానశాస్త్ర పుస్తకాలను చదివి పలు అంశాలపై విషయ అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రేరణ కలిగించేవి, సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలు చదవడం ద్వారా మానసిక పరిణితిని సాధించవచ్చన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో లైబ్రరీలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని వెల్లడించారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులు సామాజిక మాధ్యమాలకు బానిసలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టెలివిజన్, సెల్‌ఫోన్‌లతోనే ఎక్కువ సమయం వృథా చేస్తున్నారని, దీని వల్ల భవిష్యత్తు ప్రమాదకరంగా మారే పరిస్థితి ఉందని హెచ్చరించారు. ఆ దిశగా విద్యార్థులను మార్గనిర్దేశం చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పాఠశాలలో గ్రంథాలయ ఏర్పాటుకు కృషి చేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజును అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హైస్కూల్‌ను సందర్శించిన డీఈవో



పలు క్రీడా పోటీల విజేతలతో డీఈవో గిడ్డి అప్పారావు, పాఠశాల సిబ్బంది

సబ్బవరం: మండలంలోని సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను అనకాపల్లి జిల్లావిద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ప్రార్థన సమయానికి ముందే పాఠశాలకు వచ్చి అసెంబ్లీ నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాల పనివేళలు సాయంత్రం 5 గంటల వరకూ పెంచడంపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన నిర్వహణలో ఉన్న సమస్యలను ఆరా తీశారు. వంట గది, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. వివిధ క్రీడా పోటీలలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు తరగతి పాఠ్యాంశాలతో పాటు రోజుకో నీతి కథను చెప్పించాలని సూచించారు. ప్రభుత్వ స్కూళ్లలో చదువుకుని ఉన్నత స్థాయిలో స్థిరపడ్డ వారి వివరాలను విద్యార్థులకు తెలిపి, వారిలో స్ఫూర్తిని నింపాలని ఉపాధ్యాయులను కోరారు. ఆయన వెంట పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం పి.రాధాకుమారితోపాటు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఫైబర్ నెట్ బాక్సుల కొరత ఉంది

ఏపీ ఎస్‌ఎఫ్‌ఎల్ చైర్మన్ జీవీ రెడ్డి

విశాఖ విద్య: ఏపీ ఫైబర్‌నెట్‌లో బాక్సుల కొరత ఉందని, దీన్ని త్వరలోనే అధిగమిస్తామని ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ చైర్మన్ జీవీ రెడ్డి అన్నారు. ఆంధ్ర యూనివర్సిటీలోని ఏపీ ఫైబర్ నెట్‌వర్క్ ఆపరేషన్ సెంటర్‌ను శుక్రవారం జీవీ రెడ్డి సందర్శించారు. ఫైబర్ నెట్ ఉద్యోగులతో సాంకేతిక విషయాలపై చర్చించారు. ప్రస్తుతం నెలకొన్న సాంకేతిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం బాక్సుల కొరత ఉందని, త్వరలోనే ఆపరేటర్ల అందరికీ ఫైబర్ నెట్ బాక్సులను అందిస్తామన్నారు. ఈ విషయంలో ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

26న అవంత్స, ఆరుద్రల శత జయంత్యుత్సవం



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వకళా పరిషత్ తెలుగు శాఖ, ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం సంయుక్తంగా ఈ నెల 26న ఏయూ టీఎల్‌ఎన్ సభా హాల్‌లో అవంత్స సోమసుందర్, ఆరుద్రల శత జయంత్యుత్సవాలు నిర్వహించనున్నట్లు ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు తెలిపారు. కార్యక్రమ ఆహ్వాన పత్రికలను శుక్రవారం ఆయన తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ తెలుగు నేలపై మహాకవులైన అవంత్స, ఆరుద్ర శత జయంతి ఉత్సవ నిర్వహణకు ఆంధ్ర యూనివర్సిటీ వేదిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఉత్సవాలు జయప్రదానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య జర్రా అప్పారావు, అభ్యుదయ రచయితల సంఘం ప్రతినిధులు ఉప్పల అప్పలరాజు, డాక్టర్ సి.ఎస్.క్షేత్రపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.